దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

బుధవారం

25 06 2025

సంపుటి 1 సంచిక 56

UDYAM / TS-09-0148996

అమ్మో.. ఈ ఆవు ధర రూ.10 లక్షలు!

దశ, రామన్నపేట : రామన్నపేట మండలం లక్ష్మాపురంలో గుమ్మి రామిరెడ్డికి చెందిన వ్యవసాయ క్షేత్రంలోని ఆవుకు రికార్డ్ ధర పలికింది. సత్యసాయి జిల్లాలోని పెనుగొండకు చెందిన హెబ్బేవ్ గోశాల నిర్వాహకుడు రూ. 10 లక్షలకు గిర్ ఆవును కొనుగోలు చేశారు. రామిరెడ్డి నాలుగున్నరేళ్ల క్రితం గుజరాత్లోని రాజ్ కోట్ నుంచి 2 గిర్ జాతి ఆవులను తెప్పించి గోశాలను ప్రారంభించారు. ప్రస్తుతం ఇక్కడ 132 గిర్ ఆవులున్నాయి. ఈఆవు రోజుకు 16 లీటర్లు పాలు ఇస్తుంది.

ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేయమన్నారు...?

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ఎవరి ఆదేశాల మేరకు ఫోన్లను ట్యాపింగ్ చేశారో స్పష్టం చేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి నేడు సిట్ ముందు హాజరై ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

వివరాలు 2లో

వ్యవసాయాన్ని పండగ చేశాం..

- ఏపీ పట్టిసీమ కట్టింది, రాయలసీమ ఎత్తిపోతలకు జీవో ఇచ్చింది నీ హయాంలో కాదా...?
- 2033వరకు మేమే అధికారంలో ఉంటాం: సీఎం రేవంత్‌రెడ్డి



దశ, హైదరాబాద్: గోదావరి జలాలపై రాష్ట్ర అసెంబ్లీలో చర్చ పెడతాం.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిద్ధమా అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. ప్రాజెక్ట్‌ల పేరు, ఊరు మార్చి కేసీఆర్ లక్ష కోట్లు కొల్లగొట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు సీమాంధ్ర పాలకులు తెలంగాణను ఏడారిగా మార్చారని కేసీఆర్ అన్నారని చెప్పారు. తాను చంద్రబాబుతో ఉండాలనుకుంటే టీడీపీలోనే ఉండేవాడినని.. తెలంగాణ కోసమే రాహుల్‌గాంధీ ఆశీస్సులతోనే కాంగ్రెస్‌లోకి వచ్చానని ఉద్ఘాటించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన 18 నెలల కాంగ్రెస్ పాలనను బేరీజు వేయాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి

..మిగతా 2వ పేజీలో ➔

9 రోజుల్లోగా 9 వేల కోట్లు వేశాం..

రైతు నేస్తం సభలో సీఎం రేవంత్

దశ, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేంతవరకు ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా నిలబడుతూనే ఉంటుందని సీఎం ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వ్యవసాయం దండుగ కాదు.. పండుగ. రైతులను రాజులను చేయడమే లక్ష్యంగా పని చేస్తామని పునరుద్ఘాటించారు. రైతు భరోసా కింద ఈ నెల 16 వ తేదీన రైతు ఖాతాల్లోకి డబ్బు వేయడం ప్రారంభించినప్పటి నుంచి చెప్పిన మాట ప్రకారం 9 రోజుల్లోగా 9 వేల కోట్ల రూపాయలను 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేయడం పూర్తయింది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన రైతు నేస్తం కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన రైతు నేస్తం కార్యక్రమంలో రైతులు ప్రత్యక్షంగా పాల్గొనడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 16 వందల రైతు వేదికల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లక్షలాది రైతులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , జూపల్లి కృష్ణారావు , పొంగులేటి శ్రీనివాస రెడ్డి , ధనసరి అనసూయ సీతక్క, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి , ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, హర్కర వేణుగోపాల్ రావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సచివాలయం ఎదుట స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహం ముందు మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన రైతు నేస్తం సంబరాలలో సీఎం రేవంత్ రెడ్డి తో కలిసి పాల్గొన్న గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తదితరులు

(దశ, అబ్దుల్లాపూర్ మెట్)



బెట్టింగ్ బ్యాచ్ అరెస్టు

ఆన్ లైన్ బెట్టింగ్ ను సోషియల్ మీడియా లో ప్రోత్సహిస్తున్న ముఠా ను అరెస్ట్ చేశామని డీసీపీ, సైబర్ క్రైమ్ సాయి శ్రీ అన్నారు. నలుఒగురు ను అరెస్ట్ చేశాం. టెలిగ్రామ్ , ఇన్ స్టాగ్రామ్ లో బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేస్తున్నారు. 10వేలు పైన ఫాలోవర్స్ ఉన్నారు... బెట్టింగ్ చేయాలని మభ్య పెడుతున్నారు. బెట్టింగ్ ను ప్రమోట్ చేయడం ద్వారా ఓ యువకుడు నష్టపోయి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించాముని అన్నారు. ఆర్బీఐ నిబంధనలు పాటించ కుండ, తాత్కాలిక యూపిఐ , అకౌంట్స్ ను ఏర్పాటు చేసుకొని లావాదేవీలు నడిపిస్తున్నారు . కమీషన్ తోనే ఒక్కొక్కరి 50 లక్షలు సంపాదించినట్లు గుర్తించాము. బెట్టింగ్ లో తెలుగు ప్రజలను టార్గెట్ గానే మోసం చేస్తున్నారు. 2019 నుండి బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేస్తున్నారని అన్నారు. విదేశాల నుండి రన్ అవుతున్న 10 వెబ్ సైట్లు కు నిందితులు ప్రమోట్ చేస్తున్నట్లు, 2 లక్షలు మంది టెలిగ్రామ్ గ్రూప్స్ లో ఉన్నట్లు గుర్తించామన్నారు.విదేశాల నుంచి నడుస్తున్న 10 బెట్టింగ్ వెబ్‌సైట్‌లకు ప్రమోషన్ కల్పిస్తున్నట్లు కనుగొన్నారు.

దశ, హైదరాబాద్

ఉజ్జయిని మహంకాళీ జాతర ఏర్పాట్లు ఘనంగా ఉండాలి: మంత్రి పొన్నం

దశ, హైదరాబాద్: శ్రీ ఉజ్జయిని మహాకాళి అమ్మవారి ఆషాడం బోనాలు ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని, అందుకు తగ్గట్లు ఏర్పాట్లు ఉండాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి హైదరాబాద్ ఇన్చార్జ్ మంత్రి, పొన్నం ప్రభాకర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహకాళి దేవస్థానం నందు ఆషాడ జాతర బోనాలు ఉత్సవాలు జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి అధ్యక్షతన చేపట్టాగా స్థానిక శాసనసభ్యుడు శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ వెంకట్రావు, అడిషనల్ సి పి విక్రం సింగ్ మాన్ అలాగే ఆలయ కమిటీ సభ్యులు తో కలసి మంత్రి పాల్గొని ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చరిత్ర కలిగిన ఉజ్జయిని మహాకాళి అమ్మవారి ఆషాడ జాతర బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని దానికి తగ్గట్టుగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పని చేస్తూ బోనాల జాతరను విజయవంతం చేయాలని మంత్రి ఆదేశించారు.

ఉజ్జయిని మహాకాళి దేవస్థానం సికింద్రాబాద్ నందు జూలై 13న అమ్మవారికి బోనాలు సమర్పణ, 14 న రంగం భవిష్యవాణి, అమ్మవారిని అంబారిపై ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని, రెండు రోజులలో భక్తులు, ప్రజలు లక్షల్లో తరలి వస్తారని ఆ దిశగా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని మంత్రి సంబంధిత శాఖ అధికారులు ఆదేశించారు.

కూతురిపై తండ్రి లైంగిక వేధింపులు

దశ, హైదరాబాద్: కన్న బిడ్డను రక్షించా ల్సిన తండ్రే భక్షకుడిగా మారాడు. హైదరాబాద్‌లోని బొల్లారంలో అమానుష ఘటన చోటు చేసుకుంది. తన రక్తం పంచుకుని పుట్టిన కన్న బిడ్డనే చెరబట్టాలని ప్రయత్నించాడు ఓ తండ్రి. మద్యం సేవిస్తే ఎదుట ఉంది భార్యో, కూతురో కూడా తెలియకుండా విచక్షణ మరిచి ప్రవర్తించాడు ఓ తండ్రి. స్థానికంగా ఉంటున్న నాగరాజు తాగుడుకు బానిస య్యాడు. భార్యను చిత్రహింసలకు గురిచేసేవాడు. అంతటితో ఆగకుండా కన్న కూతురిపట్ల కూడా దారుణంగా ప్రవర్తించాడు.మద్యం మత్తులో కూతురి శరీర భాగాలు తాకి వేధింపులకు గురిచేశాడు నాగరాజు. భయపడిపోయిన కూతురు పెద్దగా కేకలు వేయడంతో వెంటనే అక్కడకు చేరుకున్న తల్లి.. నాగరాజు బారి నుంచి కుమార్తెను రక్షించుకుంది. ఆపై పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఈ దారుణ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. మద్యం తాగి తరచూ తనపై, తన బిడ్డపై విచక్షణారహితంగా దాడి చేస్తాడని భార్య ఫిర్యాదు చేసింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కన్నతల్లినే కడతేర్చింది..

ప్రియుడి కోసం తల్లిని చంపిన మైనర్ బాలిక

దశ, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలోని జీడిమెట్లలో దారుణం జరిగింది. 10వ తరగతి చదువుతున్న బాలిక ప్రియుడితో కలిసి కన్నతల్లిని చంపేసింది.. మానవ సంబంధాలను ప్రశ్నార్థకం చేసిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ప్రేమ వ్యవహారం తెలిసి తల్లి మందలించిందన్న కోపంతో తన ప్రియుడు, అతని తమ్ముడుతో కలిసి కూతురు కన్నతల్లినే చంపేసింది.. జీడిమెట్లలోని ఎన్ఎల్‌బీ నగర్‌లో ఈ దారుణ ఘటన జరిగింది. 10వ తరగతి చదువుతున్న తేజశ్రీకి.. నల్లగొండకు చెందిన పగిల్ల శివ (19) అనే యువకుడితో 8 నెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమకు దారి తీసుకుంది. డీజే ప్లేయర్ అయిన శివ - తేజశ్రీ ఫోన్లు, మెసేజ్‌లతో ప్రేమలో మునిగిపోయారు. అయితే.. వీరిద్దరి ప్రేమ వ్యవహారం తల్లి అంజలికి తెలిసింది. ఈ వయసులో ఇది సరైన పద్ధతి కాదని... బాగా చదువుకోవాలని కూతురిని మందలించింది. తమ ప్రేమకు అడ్డుగా ఉన్న తల్లిని చంపేయాలని డిసైడ్ అయింది. ఈ విషయాన్ని ప్రియుడు శివకు చెప్పింది. అందుకు శివ తన తమ్ముడు పగిల్లా యశ్వంత్(18) సహాయం తీసుకున్నాడు. ఈ క్రమంలో శివ, యశ్వంత్ ఇంటికి రాగా.. తేజశ్రీ కలిసి ముగ్గురూ కలిసి ఒంటరిగా ఉన్న తల్లిని కిరాతకంగా చంపేసారు. స్థానికుల ఫిర్యాదుతో జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

అంజలి

పగిల్ల శివ

మనువాద సిద్ధాంతాన్ని వ్యాప్తి చేస్తున్న బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు

డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్

దశ, సూర్యాపేట : బిజెపి ఆర్ఎస్ఎస్ లు దేశంలో మనువాద సిద్ధాంతాన్ని వ్యాప్తి చేస్తూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల అనచివేతకు పాల్పడుతున్నారని డోర్నకల్ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రెడ్డి హాస్టల్ లో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణరెడ్డి సహకారంతో మాజీ ఎంపిపి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ధరావత్ వీరన్న నాయక్ అధ్యక్షతన జరుగుతున్న ఉమ్మడి నల్గొండ జిల్లా ఆదివాసి బునియాది కార్యకర్తల శిక్షణా శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి ఆర్ఎస్ఎస్ లు మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నాయని ప్రజల మధ్య చిచ్చు పెట్టి విభజించే విధానాన్ని అవలంబిస్తున్నాయని అన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్ని వర్గాలను సమానంగా ఆదరిస్తుందని, ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ కోటియా నాయక్ భూక్యా, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, ప్రోగ్రామ్ ఇంచార్జీ లింగం నాయక్ పలువురు బంజారా ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

దశ
నిజం.. నిర్భయంగా..

చరిత్రలో ఈ రోజు

1932 : భారత క్రికెట్ జట్టు మొట్టమొదటి అధికారిక క్రికెట్ టెస్టును లార్డ్స్ మైదానం లో ఆడింది.
1941 : సోవియట్ యూనియన్ పై ఫిన్‌లాండ్ యుద్ధం ప్రకటించిన రోజు.
1945 : తెలుగు సినిమా నటి శారద జననం. (చిత్రంలో)
1946 : ప్రపంచ బ్యాంకు ఏర్పాటై, కార్యకలాపాలు మొదలు పెట్టింది.
1950 : కొరియా యుద్ధం మొదలైనది.
1975 : భారతదేశంలో ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని ప్రకటించింది.
1983 : భారత్ తొలిసారిగా క్రికెట్ లో ప్రపంచ కప్ (ప్రుడెన్షియల్ వరల్డ్ కప్) ను గెలుచుకుంది.
1991 : వింబుల్డన్‌లో మార్టినా నవ్రతిలోవా 100వ సింగిల్స్ మ్యాచ్ విజయాన్ని సాధించి రికార్డు సృష్టించిన రోజు.
2009 : అమెరికాకు చెందిన సంగీత కళాకారుడు మైకల్ జాక్సన్ మరణం (జ.1958).

యుద్ధం ఎందుకు?

యుద్ధం ఎందుకు
అవసరానిక, ఆదిపత్యానిక
అణిచివేతక, మందుగుండు,
ఆయుధాలు అమ్మటానిక

ఎవరి దేశం వారిది
సరిహద్దులతో కూడీనది
వనరులు,వత్తిడు లుంటాయి,
అంతర్గత కుమ్ములాటలు ఉంటాయి

అధికార వ్యవస్థ ఉంటుంది
రాజకీయ పార్టీలతో నడుస్తుంది
ఆర్థిక పరిపుష్టి, అసమానతలు
పేదరికం ఇంకా ఎన్నో సమస్యలు
రాజ్యములో కనబడతాయి

బలముందని,బాలగాలున్నాయని
ఆధునిక ఆయుధాలున్నాయని
అనవసర జ్యోక్యం చేసుకోని
వనరులను కోల్లగొట్టుడు, ప్రజల
ప్రాణాలు తీసుడు

అవసరానికి, వ్యాపారం
చేసుకోవచ్చు, ధనాన్ని
పోగుచేసుకోవచ్చు, ఆస్థిరత్వాన్ని
సృష్టించి,అలజడులను పురిగొలిపి
చేసే మారణహోమం మంచిదికాదు

ఐక్యరాజ్యాసమితి చర్చ చేయాలి
అన్ని దేశాలను సంప్రదించాలి
శాంతియుతంగా సమస్యను
పరిష్కరించాలి, యుద్ధాలు
చేయకుండా చూడాలి.

రచన:
కడెం. ధనంజయ, చిత్తలూర్

ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేయమన్నారు...?

❖ బీజేపీ నేత ఈటల రాజేందర్

దశ, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ఎవరి ఆదేశాల మేరకు ఫోన్లను ట్యాపింగ్ చేశారో స్పష్టం చేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి నేడు సిట్ ముందు హాజరై ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు.అనంతరం ఈటల మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, గతంలో తన ఫోన్‌ను అనేక సందర్భాల్లో ట్యాప్ చేశారని ఆరోపించారు. "నేను హుజూరాబాద్‌లో పోటీ చేసినప్పుడు, 2023లో గజ్వేల్‌లో ఎన్నికల బరిలో నిలిచినప్పుడు అత్యంత దుర్మార్గమైన పద్ధతిలో నా ఫోన్‌ను ట్యాప్ చేశారు. అంతేకాకుండా, మునుగోడు ఉప ఎన్నికల సమయంలో మేం ఎవరితో సంభాషిస్తున్నాం, ఎలాంటి వ్యూహాలు రచిస్తున్నామనేది కూడా ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటెలిజెన్స్ విభాగం మొత్తం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కనుసన్నల్లోనే నడిచిందని ఈటల విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నియమించిన కమిటీ ఇచ్చిన నివేదికను ఇప్పటికీ ప్రభుత్వం బయటపెట్టకపోవడంపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. "ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ కమిషన్ వేసి దాదాపు ఏడాదిన్నర కావస్తోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు లాలూచీ పడకపోతే, ఈ విచారణ నివేదికలను ఎందుకు వెల్లడించడం లేదో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలి" అని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

ప్రజల రక్షణ కోసమే చట్టాలు

❖ జరిమానా మార్పు కోసమే
❖ తప్పుల నుండి మంచి పాఠాలు నేర్చుకుని జాగ్రత్తగా ఉండాలి: ఎస్పీ నరసింహ

దశ, సూర్యాపేట : చట్టాలు ప్రజల రక్షణ కోసం ఏర్పాటు చేయబడినవి. జరిమానా మార్పు కోసమే. తప్పుల నుండి మంచి పాఠాలు నేర్చుకుని జాగ్రత్తగా ఉండాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో పబ్లిక్ క్లబ్ నందు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసులు, పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ మరియు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం. ఈ సందర్భంగా అయన మాట్లాడారు . మాదకద్రవ్యాల బారి నుండి సమాజాన్ని కాపాడుకోవాలని, మత్తు పదార్థాల నుండి మన పిల్లల రక్షణ మన బాధ్యత అని , వ్యక్తిగత క్రమశిక్షణ, వ్యక్తిగత అభిమానం ఉన్నప్పుడే ఇతరులపట్ల మర్యాదగా ఉండగలమని అన్నారు . రోడ్డు భద్రత ప్రమాదాల నివారణలో పోలీసులతో భాగస్వామ్యం కావాలని తెలిపారు. అతివేగంగా వాహనాలు నడపవద్దు. మొబైల్ చూస్తూ వాహనాలు నడపవద్దు. సీట్ బెల్టు ధరించాలి. రోడ్డుకు ఎడమ పక్కన వాహనం నడపాలి. మూల మలుపుల వద్ద రోడ్డు దాటేటప్పుడు ఇండికేటర్లను ఉపయోగించాలి. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దు. పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దు అని పలు సూచనలు చేశారు . ఈ కార్యక్రమంలో ఆర్ టి ఓ సురేష్ రెడ్డి , సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం , ఎస్సై ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణా తరగతులు ప్రారంభం

దశ భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి వ్యాప్తంగా ఎస్ అండ్ పిసి సెక్యూరిటీ గార్డులకు విడతల వారీగా నిర్వహించే ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణా తరగతులలో భాగంగా గురువారం నుండి ఈ 27వ తేదీ వరకు ట్రైనింగ్ సెంటర్ నందు నిర్వహించే 50వ ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణా తరగతుల కార్యక్రమాన్ని సెక్యూరిటీ ట్రైనింగ్ యండి.జాకీర్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బంది అందరికీ క్రమశిక్షణ అనేది ముఖ్యమని పేర్కొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నపుడే మనకు గుర్తింపు వస్తుందని ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణ సెక్యూరిటీ సిబ్బంది అందరికీ అవసరం అని ఈ శిక్షణ వలన డ్యూటీ జీవితంలోనే కాకుండా వ్యక్తిగతంగా కూడా ఉపయోగకరమైనదని ఈ నాలుగు రోజుల శిక్షణా కాలంలో ట్రాఫిక్ రెగ్యులేటరీ చట్టం మాండేటరీ కాషనరీ ఇన్ఫర్మేటరీ సిగ్నల్స్ ట్రాఫిక్ పాయింట్ మన్ డ్యూటీస్ క్రౌడ్ కంట్రోల్ వంటి అంశాలపై అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే పూర్తి అవగాహన కలిగించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ వలన ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా మెయిన్ గేటు వద్ద చెక్ పోస్ట్ ల వద్ద రద్దీ లేకుండా సాఫీగా అందరు తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు దోహదం చేస్తుందని, ఎస్ అండ్ పిసి పటిష్టంగా ఉండేందుకు కావలసిన అన్ని రకాల చర్యలు ట్రైనింగ్ సెంటర్ అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు యాజమాన్యం అందిస్తుందని సెక్యూరిటీ సిబ్బంది అందరు మెరుగైన వృత్తి నైపుణ్యంతో అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ సింగరేణి ఆస్తులు స్థలాలను పరిరక్షించాలని సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలి అని తెలిపారు. అనంతరం ట్రాఫిక్ యస్.ఐ యస్.కె.మదార్ మాండేటరీ కాషనరీ ఇన్ఫర్మేటరీ సిగ్నల్స్ డ్రైవర్ హ్యాండ్ సిగ్నల్స్ రోడ్డు భద్రతా నియమాల గురించి బోధించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్స్ట్రక్టర్ డి.నారాయణరెడ్డి, యస్.ఐ యస్.కె.మదార్, ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల కౌన్సిలింగ్

దశ, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం ఏరియా జిఎం. షాలేం రాజు ఆదేశాల మేరకు కారుణ్య నియామకాల కొరకు పద్మావతి ఖని మైన్ నందు విధులు నిర్వహిస్తూ మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన మరణించిన ఉద్యోగుల వారసులు 9 మందికి పద్మావతి ఖని ఏజెంట్ కార్యాలయంలో ముఖాముఖీ (కౌన్సిలింగ్) కార్యక్రమాన్ని వారి కుటుంబ సభ్యుల సాక్షుల సమక్షంలో మంగళవారం నిర్వహించి అన్నివివరాలు నమోదు చేసి కౌన్సిలింగ్ పూర్తి అయిన తరువాత అందరిని వైద్యపరీక్షల కొరకు పంపించి కంపెనీ నియమ నిబంధనలు అనుసరించి వారికి నియామక ఉత్తర్వులు అందజేయడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మావతి ఖని మైన్ ఏజెంట్ బి.రవీందర్, డి.జి.యం (పర్సనల్) గామలపాటి వెంకట మోహన్ రావు, మైన్ మేనేజర్ ఎం.వి.ఎన్ శ్యాం ప్రసాద్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ మజ్జి మురళి, మైన్ సంక్షేమ అధికారి షేక్ షకీల్, సంబంధిత క్లర్క్ కొత్తపల్లి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడి కేసులో నిందితులు అరెస్టు

❖ రూ 72 లక్షలు స్వాధీనం

దశ, సికింద్రాబాద్: ఇటీవల మోండా మార్కెట్ లో జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. సినీ ఫక్కి లో జరిగిన దోపిడీని చాకచక్యంగా ఛేదించారు. 43 లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు మార్కెట్ పోలీసులు. 72 లక్షల రూపాయలతో పరారైన ఇద్దరు వ్యక్తులను గోవాలో పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధం ఉన్న మరి కొంతమందిని కర్ణాటకలో అరెస్టు చేసారు. ఈ కేసులో మొత్తం 18 మంది నిందితులను గుర్తించి ఎఫ్ఐఆర్ లో చేర్చారు. మార్కెట్లో దోపిడీ చేసిన 74 లక్షలతో జేబీఎస్ నుండి వాహనంలో పరారైన భాను ప్రకాష్ రాంబాబులను పట్టుకున్నారు. ఎస్ఓటి పోలీసుల పేరుతో డబ్బును అపహరించుకుని దుండగులు పరారయ్యారు. పథకం ప్రకారం ఎనిమిదవ బెటాలియన్ కానిస్టేబుల్ కేశవ్ ను ముఠా సభ్యులు వాడుకున్నారు. సీసీ కెమెరాలు సెల్ ఫోన్ సిగ్నల్స్ ద్వారా నిందితులను పట్టుకున్నారు.

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం పరిధిలో ఆధునిక గోశాల నిర్మించాలని సీఎం ఎ. రేవంత్ రెడ్డి ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. ఆధునిక గోశాల నిర్మాణం కోసం వేములవాడ సమీపంలోని మరిపెల్లి గ్రామంలో 40 ఎకరాల స్థలం గుర్తించినట్టుమంగళవారం సీఎం దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , వాకిటి శ్రీహరి ఉన్నారు. -(దశ, హైద్రాబాద్)

జర్నలిస్ట్ పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ

దశ, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పని చేస్తున్న జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర చారి మంగళవారం జీవో విడుదల చేశారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టియుడబ్ల్యూజే టీజేఎఫ్) విజ్ఞప్తి మేరకు ఈ జీవోను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కల్లోజు శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కాపీని అందుకున్న వారిలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్లోజి శ్రీనివాస్, ఎండి షఫీ, టెంజు జిల్లా అధ్యక్షులు వట్టికొండ రవి, నేషనల్ కౌన్సిల్ సభ్యులు చంద్ర నరసింహారావు, సాక్షి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో కృష్ణ గోవిందు, సహాయ కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, రాజ్ కుమార్, మన తెలంగాణ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ క్రాంతి పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని పండగ చేశాం..

మొదటి పేజీ తరువాయి..

మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ చెప్పాకే బనకచర్లపై ఏపీ ముందుకు వెళుతోందని స్పష్టం చేశారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టులు ఆగిపోవడానికి కారణం ఎవరని ప్రశ్నించారు. కేసీఆర్ కుట్రలతోనే తెలంగాణ ప్రాజెక్టులు ఆగిపోయాయని ఆరోపించారు.

వ్యవసాయాన్ని పండగ చేశాం

'రైతు భరోసాని తొమ్మిదిరోజుల్లోనే రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. 1600రైతు వేదికల వద్ద 71లక్షల మంది రైతులు సంబరాలు చేసుకుంటున్నారు. వ్యవసాయం దండగ అనే పరిస్థితుల నుంచి పండగ చేశాం. మా మొదటి ప్రాధాన్యం రైతులు, మహిళలు, తెలంగాణ ఉద్యమ కారులు, విద్యార్థులు. ఎన్నికలప్పుడు 2లక్షల్లోపు రైతు రుణమాఫీ చేస్తాం అని చెప్పాం. చెప్పినట్లే 25లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేశాం. కేసీఆర్ వరి వేస్తే ఉరి అని చెప్పారని... మేం వరి కొనుగోలు చేస్తాం అని చెప్పాం. పండించి ప్రతి గింజను కొనుగోలు చేశాం. కేసీఆర్ కుటుంబ సభ్యులు శ్రీమంతులు ఎలా అయ్యారు. రాష్ట్రం ఎందుకు దివాళా తీసింది. నేను వచ్చాక 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నిరూపిస్తా. కేసీఆర్ పదేళ్లలో మీరు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పండి. మేం చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా కేసీఆర్. కాళేశ్వరం పేరిట మీరు లక్ష కోట్లు దోచుకున్నారు. మేం రైతుల కోసం లక్ష 40వేల కోట్లు ఖర్చు చేశాం' అని వెల్లడించారు.

బనకచర్లపై అసెంబ్లీలో చర్చ పెడదాం వస్తావా. తేదీ చెప్పండి అదే రోజు అసెంబ్లీ పెడదాం. నువ్వు ఇచ్చిన సలహాతోనే కదా బనకచర్ల దరిద్రం దాపురించింది. రాయలసీమను రతనాల సీమ చేస్తా అన్న సన్నాసి నువ్వు కాదా కేసీఆర్. నీ అల్లుడితో మాట్లాడించడం కాదు. నువ్వు చర్చకు రా. స్పీకర్‌కు లేఖ రాయి. అసెంబ్లీలో చర్చిద్దాం. ఒక రోజు కృష్ణాపై, మరో రోజు గోదావరి నీళ్లపై చర్చిద్దాం. కృష్ణాలో 512 టీఎంసీల నీరు ఏపీకి రాసిచ్చింది, తెలంగాణకు 299 టీఎంసీలకు ఒప్పుకున్నది నువ్వు కాదా. ఏపీ పట్టిసీమ కట్టింది, రాయలసీమ ఎత్తిపోతలకు జీవో ఇచ్చింది నీ హయాంలో కాదా. తెలంగాణకు మరణ శాసనం రాసింది నువ్వు కాదా. నీకు మొహం చెల్లక ఫాంహౌస్‌లో పడుకున్నావ్. బీఆర్ఎస్ చచ్చిన పాము. అది ఇంకా అధికారంలోకి రాదు. మీరు ఏపీకి సహకరిస్తే సుప్రీంకోర్టుకు వెళ్తామని కేంద్ర ప్రభుత్వానికి చెప్పి వచ్చాం. రాబోయే రోజుల్లో రాజీవ్ యువ వికాసాన్ని ముందుకు తీసుకెళ్తాం. యువకులను ఆదుకుంటాం. 2033వరకు మేమే అధికారంలో ఉంటాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

డ్రగ్స్ సరఫరా చేసిన యువకుడు అరెస్టు

దశ, రంగారెడ్డి: ఈజీ మనీకి అలవాటుపడిన కొంతమంది యువకులు అనేక అడ్డదారులు తొక్కుతున్నారు. నిషేధిత ఎండిఎంయే డ్రగ్స్ సరఫరా చేస్తూ తాజాగా ఓ యువకుడు ఎక్సయిజ్ పోలీసులకు చిక్కాడు. వివరాల్లోకి వెళ్తే.... రంగారెడ్డి జిల్లా మైలార్ దేవుపల్లిలో ఓ యువకుడు అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా... అనుమానం వచ్చిన ఎక్సయిజ్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది అతన్ని తనిఖీ చేయగా 23 గ్రాముల ఎండిఎంయే డ్రగ్స్ ప్యాకెట్లు లభ్యమయ్యాయి. బెంగళూరు లో షరీఫ్ అనే వ్యక్తి ద్వారా కొనుగోలు చేసి ఒక్కో గ్రాము 3 నుంచి 5 వేల రూపాయల చొప్పున నగరంలో విక్రయిస్తున్నట్లు ఎక్సయిజ్ పోలీసులు గుర్తించారు.అతని వద్ద నుంచి ఎండిఎంయే డ్రగ్స్ తో పాటు ఓ పల్సర్ బైక్ , సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించినట్లు జిల్లా అసిస్టెంట్ ఎక్సయిజ్ సూపరిండెంట్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

ఘనంగా మురళీమోహన్ జన్మదిన వేడుకలు

దశ, హైదరాబాద్: సినీ నిర్మాత హీరో మాజీ ప్రజా ప్రతినిధి మురళీమోహన్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సినీ పెద్దలతో పాటు ఆర్టిస్టులు టెక్నీషియన్లు ప్రొడ్యూసర్లు పెద్ద ఎత్తున హాజరై కేక్ కట్ చేపించి ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మురళి మోహన్ నటిస్తున్న డొక్క సీతమ్మ పోస్టర్ను ఆవిష్కరించారు.